# వినాయక వ్రత కథ

**ఒకరోజు ధర్మరాజు, శౌనకాది మహామునులందరూ సత్సంగ కాలక్షేపం కోసం సూతుడి దగ్గరికి వెళ్లారు. అప్పుడు సూతుడు మిగతా మునులతో 'నేను ఈ రోజు మీకు వినాయకుని పుట్టుక, చవితి రోజున చంద్రుణ్ని దర్శిస్తే కలిగే దోషం, దాని నివారణోపాయములు వివరిస్తాను' అని చెప్పడం మొదలు పెట్టాడు. శౌనకాది మహామునులంతా శ్రద్ధగా వింటున్నారు.**

**పూర్వకాలంలో** ఏనుగు రూపం కల గజాసురుడు అనే రాక్షసుడు పరమశివుని గురించి ఘోర తపస్సు చెయ్యడం ప్రారంభించాడు. అతని తపస్సుకు మెచ్చిన శివుడు 'గజాసురా! నీకేమి వరము కావలెనో కోరుకో' అని అడిగాడు. అప్పుడు గజాసురుడు శివుణ్ని అనేక విధాలుగా స్తుతించి 'స్వామీ! లోకాలన్నిటిలోనూ పూజలందుకునే మీరు ఇకపై నా ఉదరంలో నివాసం ఉండాలి' అని వరాన్ని అడిగాడు. భక్తుల కోరికలను ఎన్నడూ జవదాటని బోళా శంకరుడు వెంటనే గజాసురుని ఉదరంలో ప్రవేశించి అక్కడే నివాసం ఉన్నాడు.

కైలాసంలో పార్వతీదేవి తన భర్త ఎటు వెళ్లాడో తెలియక అనేకచోట్ల వెతికి, ఎక్కడా కనిపించక నిరాశ చెందింది. కొంతకాలానికి తన పతి గజాసురుడనే రాక్షసుని ఉదరంలో ఉన్నాడని తెలుసుకుంది. శంకరుడిని తిరిగి తీసుకువచ్చే మార్గం తెలియక బాధపడుతూ చివరికి విష్ణుమూర్తిని ప్రార్థించి, జరిగినదంతా చెప్పి 'ఓ మహానుభావా! పూర్వం భస్మాసురుడి బారి నుంచి నా భర్తను రక్షించావు. ఇప్పుడు కూడా అలాగే తగు ఉపాయంతో రక్షించమని' అడిగింది. అప్పుడు శ్రీహరి పార్వతిని అనునయించి నేనున్నానని అభయమిచ్చాడు. బ్రహ్మాది దేవతలను పిలిపించాడు విష్ణువు. గజాసురుని ఉదరంలో బందీ అయిన పరమేశ్వరుడిని ఎలా బయటికి తీసుకురావాలో చర్చించాడు. చివరికి 'దీనికి గంగిరెద్దుల మేళమే సరి అయినదనే' ఆలోచనకు వచ్చాడు. శివుని వాహనమైన నందిని గంగిరెద్దుగా అలంకరించారు దేవతలు. బ్రహ్మాది దేవతలంతా తలో వాద్యం చేతబూనారు. విష్ణువు చిరుగంటలు, సన్నాయి పట్టుకొని మేళగాని వేషం కట్టుకున్నాడు.

దేవతలంతా గంగిరెద్దు మేళంతో గజాసురుని రాజ్యంలో ప్రవేశించారు. నగరంలో పలు చోట్ల జగన్మోహనముగా గంగిరెద్దును ఆడించారు. ఆ నోటా ఈ నోటా వీరి ఆటాపాటా సంగతి గజాసురునికి చేరింది. వారిని పిలిపించి తమ భవనం ఎదుట మేళం కట్టమన్నాడు గజాసురుడు. బ్రహ్మాది దేవతలు వాద్యాలను విశేషంగా వాయిస్తూ వీనుల విందు చేశారు. శ్రీహరి గంగిరెద్దును చిత్రవిచిత్రంగా ఆడిస్తూ గజాసురునికి కన్నులపండువ చేశాడు. వారి ప్రదర్శనకు పరమానంద భరితుడయ్యాడు గజాసురుడు. 'మీకేమి కావాలో కోరుకోండి' అని అడిగాడు. అప్పుడు శ్రీహరి గజాసురుడిని సమీపించి 'ఓ రాజా! ఇది శివుని వాహనమైన నంది. శివుడిని కనుగొనడానికి వచ్చింది. కనుక, పరమశివుడిని తిరిగి ఇవ్వమ'ని అన్నాడు. ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు గజాసురుడు. ఆ వచ్చింది రాక్షసాంతకుడైన శ్రీహరి అని గుర్తించి తనకిక మరణం తప్పదనుకున్నాడు. 'నా శిరస్సుకు త్రిలోకాలలో పూజలు జరగాలి. నా చర్మాన్ని నీవు ధరించాలి' అని తన ఉదరంలో ఉన్న శివుడిని ప్రార్థించాడు గజాసురుడు. శంకరుడు 'సరేనని' వరమిచ్చాడు. వెంటనే శ్రీహరి అనుమతితో నంది తన కొమ్ములతో గజాసురుని పొట్టను చీల్చి సంహరించాడు. శివుడు ఆ అసురుని ఉదరం నుంచి బయటికి వచ్చి విష్ణుమూర్తిని స్తుతించాడు. బ్రహ్మాదులతో శ్రీహరి 'దుష్టులకు ఇటువంటి వరములు ఇవ్వకూడదు. ఇచ్చినట్లయితే పాముకు పాలు పోసి పెంచినట్లు అవుతుంది' అని చెప్పి వైకుంఠానికి వెళ్లిపోయాడు. శివుడు నందిని ఎక్కి కైలాసాని కేగాడు. బ్రహ్మాది దేవతలంతా స్వస్థలాలకు వెళ్లిపోయారు.

## వినాయక జననం

కైలాసంలో ఉన్న పార్వతి తన భర్త వస్తున్నాడని దేవతల ద్వారా తెలుసుకొని సంతోషించింది. అభ్యంగన స్నానం చేసి, నలుగు పిండితో ఒక బాలుణ్ని తయారుచేసి ప్రాణం పోసింది. ఆ బాలుణ్ని ద్వారం దగ్గర కాపలాగా ఉంచింది. సర్వాభరణాలు అలంకరించుకున్న పార్వతి పశుపతి రాక కోసం ఎదురుచూస్తూ తన గదిలో ఉంది. అంతలో పరమేశ్వరుడు నందిని అధిరోహించి కైలాసానికి వచ్చాడు. గదిలోకి వెళ్లబోతుండగా ద్వారం దగ్గర



ఉన్న బాలుడు పరమశివుణ్ని అడ్డగించాడు. దానితో కోపావేశుడైన శివుడు, తన త్రిశూలంతో ఆ బాలుని శిరస్సు ఛేదించి లోపలికి వెళ్లాడు.

చాలాకాలం తర్వాత వచ్చిన శివుడిని సాదరంగా ఆహ్వానించింది పార్వతి. దంపతులిద్దరూ ప్రేమగా మాట్లాడుకుంటూ ఉండగా మధ్యలో బాలుని ప్రస్తావన వచ్చింది. జరిగిన పొరపాటును తలచుకొని శంకరుడు చింతించాడు. అదే సమయంలో మహే



శ్వరునికి తాను గజాసురునికి ఇచ్చిన వరం గుర్తొచ్చింది. శివగణాలను పంపి గజాసురుని తలను తెప్పించాడు. దానిని ఆ బాలుడి శరీరానికి అతికించి ప్రాణం పోసి 'గజాననుడనే' పేరు పెట్టాడు. ఆ బాలుడిని పుత్ర వాత్సల్యంతో ఆదిదంపతులు ఇద్దరూ అల్లారుముద్దుగా పెంచసాగారు. గజాననుడు కూడా భక్తి ప్రపత్తులతో తల్లిదండ్రులను సేవించాడు. అనింద్యుడనే ఎలుకను వాహనంగా చేసుకున్నాడు గజాననుడు. కొన్ని రోజులకు పార్వతీ పరమేశ్వరులకు కుమారస్వామి జన్మించాడు. అతను మహాబలశాలి. కుమారస్వామి నెమలిని వాహనంగా చేసుకుని దేవతల సేనానాయకుడిగా ప్రఖ్యాతి చెందాడు.